క్లుప్తంగా

సుళేకేరిలో క్రికెట్ టోర్నీ ప్రారంభం



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కౌతాళం: మండల పరిధిలోని సుళేకేరి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాజేంద్ర, ఆదిరెడ్డి మంగళవారం డివిజన్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు స్నేహభావం పెంపొందుతుందన్నారు. టోర్నీలో విజేతగా నిలిచిన జట్టుకు ప్రథమ బహుమతిగా రూ.30 వేలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం నాయకుడు ప్రదీప్ రెడ్డి అందజేస్తారని తెలిపారు. రన్నర్ జట్టుకు రూ.20 వేలు ఇస్తామన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు



ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ కిరణ్‌బాబు

మంత్రాలయం: వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని నడిపితే కఠిన చర్యలు తప్పవని మాధవరం ఎస్‌ఐ కిరణ్ బాబు హెచ్చరించారు. మంగళవారం మాధవరం పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని, డ్రైవింగ్ లైసెన్స్‌లు తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్నారు. ఏఎస్‌ఐ బందే నవాజ్, హెడ్ కానిస్టేబుల్ వీరేష్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యం, నిందితులతో సెబ్ సీఐ

కోసిగి: మండల పరిధిలో కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు సెబ్ సీఐ ఎస్‌ఎం. మహబూబ్ బాషా తెలిపారు. మంగళవారం ఉదయం తుంగభద్ర నది సమీపంలో ఎస్‌ఐ ఎన్.రమేష్ బాబు, సెబ్ సిబ్బందితో కలిసి తనిఖీలు చేశామన్నారు. తుంబిగనూరు గ్రామానికి చెందిన హనుమేష్, హుసేన్ 13 బాక్సుల్లో 1,248 టెట్రా ప్యాకెట్స్ తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వాటి విలువ రూ.51 వేలు ఉంటుందన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. దాడుల్లో సెబ్ హెడ్ కానిస్టేబుల్స్ రాయుడు, నాగరాజు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లు పక్కాగా చేపట్టండి



రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి

ఆదోనిటౌన్: ఆదోని మున్సిపాలిటీలో ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్‌ను పక్కాగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి ఆదేశించారు. ఆయన మంగళవారం 40వ వార్డు సచివాలయంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ప్రభుత్వ నియమ, నిబంధనల మేరకే రిజిస్ట్రేషన్లు జరగాలన్నారు. ఎలాంటి తప్పిదాలు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. 42 వార్డుల పరిధిలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్‌ను కలిసిన తహసీల్దార్



సబ్‌కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తహసీల్దార్ సురేష్‌బాబు

ఆదోనిరూరల్: మండలంలోని పెద్దకడబూరు మండలానికి నూతనంగా నియమితులైన తహసీల్దార్ సురేష్‌బాబు మంగళవారం ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. విధుల పట్ల నిబద్ధతతో పనిచేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సబ్‌కలెక్టర్ ఆయనకు సూచించారు.

బావూజీ పేటకు మహర్దశ



బావూజీ పేటలో ఏర్పాటు చేసిన సీసీ రోడ్లు



టెలికాం నగర్‌లో మురుగు కాలువలు నిర్మించిన దృశ్యం

- రూ.50 లక్షలతో సీసీ రోడ్లు, మురుగు కాలువలు, పైపులైన్ పనులు
- సంక్షేమ పథకాల ద్వారా వార్డు ప్రజలకు రూ.17.15 కోట్లు లబ్ధి



ఆదోనిటౌన్: ఆదోని మున్సిపాలిటీ పరిధి 2వ వార్డు బావూజీ పేట అభివృద్ధి దిశగా దూసుకుపోతోంది. వైఎస్సార్‌సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో కాలనీలో సుమారు రూ.50 లక్షలు మేర ఖర్చు చేసి సీసీ రోడ్లు, మురుగు కాలువలు, కల్వర్టులు, తాగునీటి పైపులైన్‌లు ఏర్పాటు చేశారు. నవరత్నాల్లో భాగంగా వివిధ సంక్షేమ పథకాల ద్వారా వార్డులోని దాదాపు 4 వేల మందికి రూ.17,15,47,430 లబ్ధి చేకూరింది. మునుపెన్నడూ లేని విధంగా వార్డులో సందుసందున సీసీ రోడ్లు, మురుగు కాలువలు ఏర్పాటు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

➤ 2వ వార్డు బావూజీపేట, టెలికాం నగర్, ఫారెస్ట్ లైన్ ప్రాంతాల్లో 4,150 మంది జనాభా ఉన్నారు. అందులో 2100 మహిళలు, 2050 పురుషులు ఉన్నారు.



టెలికాం నగర్‌లో విశాలమైన రోడ్డు

➤ 2వ వార్డులో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.11 లక్షలతో చంద్రమౌళేశ్వర స్వామి గుడి ఏరియా, బావూజీ పేటలో మురుగు కాలువ, సీసీ రోడ్డు ఏర్పాటు చేశారు.

➤ రూ.13 లక్షలతో 15వ ఆర్థిక సంఘం నిధులతో టెలికాం నగర్‌లో సీసీ రోడ్లు, మురుగు కాలువ, ఖాళీగా ఉన్న లోతట్టు ప్రాంతాన్ని చదును చేశారు. వార్డులో మున్సిపల్ జనరల్ ఫండ్స్ ద్వారా రూ.15 లక్షలు ఖర్చు చేసి ప్రతి సందులో రోడ్లు, కాలువలు ఏర్పాటు చేశారు. మరో రూ.11 లక్షలతో తాగునీటి పైపులైన్లు ఇంటర్నల్ కనెక్షన్ల పనులు జరిగాయి.

గతంలో మురుగు నీటిని ఎత్తిపోసేవాళ్లం



కాలనీలో చంద్రమౌళేశ్వరస్వామి గుడి, బావూజీపేట మధ్యలో మా ఇల్లు ఉంది. గతంలో అక్కడ రోడ్లు, కాలువలు లేవు. మురుగు నీటిని ఎత్తి పారబోసేవాళ్లం. ఐదారేళ్లకు పైగానే నీటిని ఎత్తిపోశాం. జగనన్న ప్రభుత్వంలో ఇంటి ముందు రోడ్లు, కాలువలు నిర్మించి వీధి లైట్లు వేశారు. ఇంటి ముందు అందంగా రాత్రివేళల్లో వెలుతురు ఉంటుంది. ఇంతకన్నా అభివృద్ధి ఇంకేముంటుంది. జగనన్నకు రుణపడి ఉంటాం. మళ్లీ జగనన్నే సీఎం కావాలి.

– జీరంగి మల్లీశ్వరిబాయి, బావూజీపేట

ఎంతో అభివృద్ధి జరిగింది



2వ వార్డు పరిధిలో టెలికాం నగర్, బావూజీ పేట, చంద్రమౌళేశ్వర స్వామి గుడి ఏరియాలో సీసీ రోడ్లు, మురుగు కాలువలను రూ.50 లక్షలతో ఏర్పాటు చేశాం. గతంలో కాలువలు, రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడేవారు. జగనన్న పాలనలో తగినన్ని నిధులు మంజూరు కావడంతో ప్రజల అవసరం మేరకు వసతులు కల్పించాం. రోడ్లు, కాలువలను ఏర్పాటు చేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎవరికి ఏ అవసరం వచ్చినా ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి సహకారంతో పరిష్కరిస్తున్నాం.

– ఎ.వి.సురేష్, 2వ వార్డు కౌన్సిలర్

రోడ్లు నిర్మించారు



చంద్రమౌళేశ్వరస్వామి గుడి ఏరియా లోతట్టు ప్రాంతం. గతంలో రోడ్లు, కాలువలు లేక ఇళ్ల ముందే మురుగు, వరద నీరు నిల్వ ఉండేది. రాకపోకలకు కూడా ఇబ్బంది ఉండేది.ఈ సమస్యలను వార్డు కౌన్సిలర్ దృష్టికి తీసుకెళ్లాం. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి కాలనీలో పర్యటించిన సమయంలో సమస్యలను వివరించాం. ఎమ్మెల్యే చర్యలు చేపట్టి కాలనీలో సీసీ రోడ్లు, కాలువలు ఏర్పాటు చేశారు. చాలా సంతోషంగా ఉంది. ఇంత త్వరగా రోడ్లు, కాలువలు నిర్మిస్తారని అనుకోలేదు. జగనన్నకే మా మద్దతు.

– సుభాష్, బావూజీపేట

దరఖాస్తు చేసుకోండి

ఆదోని సెంట్రల్: ఆదోనిలో నూతనంగా ప్రారంభించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ అధ్యాపకుడి పోస్టుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శివారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ కంప్యూటర్ లేదా ఎంసీఏలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారికి ప్రాధాన్యత ఉంటుందని, 9వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (వైఎంకే స్కూల్) క్యాంపస్‌లో డెమో తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థికి గంటకు రూ.400 చొప్పున గౌరవ వేతనం ఉంటుందని వివరాలకు 98660 41775 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

గడప గడపకు నిధులతో అభివృద్ధి పనులు



డ్రైనేజీ కాలువల పనులను పరిశీలిస్తున్న నాయకులు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని బీరప్పగుడి మెయిన్ రోడ్డు నుంచి రైల్వే పట్టాల వరకు గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో డ్రైనేజీ కాలువ, సీసీరోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. మంగళవారం ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్‌రెడ్డి పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి చొరవతో గడప గడప నిధులు రూ.14 లక్షలు వెచ్చించి పనులు చేయిస్తున్నట్లు చెప్పారు. ఈ కాలనీ రోడ్డు నుంచే కోసిగిలోని 1, 7, 8, 9వ వార్డులకు చెందిన ప్రజలు శ్మశాన వాటికకు వెళ్లాల్సి ఉందన్నారు. దీనిపై కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. నాయకులు జగదీష్‌స్వామి, వీరస్వామి, నరసింహులు, బసిరెడ్డి, రజాక్, గౌస్‌ఖాన్, వీరేష్, భీమయ్య పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష.. పేదలకు రక్ష



మాట్లాడుతున్న వైద్యాధికారి అభిరూప్

కోసిగి: పేదల సంపూర్ణ ఆరోగ్యమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లక్ష్యమని డాక్టర్ అభిరూప్ అన్నారు. మంగళవారం కోసిగి మండలం చిర్తనకల్లు సచివాలయం పరిధిలోని చిర్తనకల్లు, మూగలదొడ్డిలో జగనన్న ఆరోగ్య సురక్ష -2 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు ఇంటి ముంగిటకే అత్యాధునిక వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. సచివాలయం పరిధిలో 309 మందికి వివిధ వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా కంటి అద్దాలు, మందులు అందజేశారు. అవసరమైన వ్యాధిగ్రస్తులను ఆరోగ్యశ్రీ ద్వారా కర్నూలుకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్స్ ఎల్లప్ప, శ్రీనివాసులు, హెల్త్ అసిస్టెంట్ కృపానందం పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

ఆదోనిటౌన్: ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏపీ ఎన్‌జీఓ ఆదోని తాలూకా అధ్యక్షుడు రమేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీ ఎన్‌జీఓ భవనంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేందుకు ముందుకు రావాలన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి మల్లికార్జునరెడ్డి, ఉపాధ్యక్షురాలు ఉషారాణి, విజయ్‌రాజు, రామ్మోహన్‌రెడ్డి, బజారప్ప, ఆంజనేయులు పాల్గొన్నారు.

చిన్నభూంపల్లిలో కార్డెన్ సెర్చ్



గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ ప్రసాద్

కోసిగి: మండల పరిధిలోని చిన్నభూంపల్లి గ్రామంలో మంగళవారం వేకువజామున ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య ఆదేశాల మేరకు సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో కోసిగి, పెద్దకడబూరు ఎస్‌ఐలు సతీష్‌కుమార్, మహేష్‌కుమార్‌లతో కలిసి డీఎస్పీ స్పెషల్ పార్టీ పోలీసులు, సివిల్ పోలీసులు దాదాపు 40 మందితో తనిఖీలు నిర్వహించారు. గ్రామంలో ఇరువురు పార్టీ నాయకులు, అనుమానిత ఇళ్లల్లో సోదాలు చేశారు. మారణాయుధాలు, అక్రమ మద్యం, రికార్డులు లేని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమయ్యారు. సమస్యాత్మకమైన చిన్నభూంపల్లి గ్రామ ప్రజలు శాంతియుతంగా నడుచుకోవాలన్నారు. పాతకక్షలను మనసులో పెట్టుకుని ఘర్షణలకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. ఎలాంటి సమస్య ఉన్న పోలీసుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ఫ్యాక్షన్ వీడి కుటుంబంలోని పిల్లలను బాగా చదివించుకుని బంగారు భవిష్యత్‌ను అందించాలని సూచించారు. దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సొసైటీ వార్షికోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్త

ఆదోనిఅర్బన్: శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కోపరేటివ్ బ్యాంకు వారి సౌజన్యంతో భగవాన్ శ్రీ మహాయోగి లక్ష్మమ్మ ఎడ్యుకేషనల్ సొసైటీ 20వ వార్షికోత్సవం స్థానిక బ్యాంకు ఆవరణలో రాయచోటి రామయ్య అధ్యక్షతన చేపట్టారు. బీఓఎం చైర్మన్ రాయచోటి సుబ్బయ్య, వైస్ చైర్మన్ ఇ.లక్ష్మీనారాయణశెట్టి, డైరెక్టర్ ఆర్ఎంజీ రెడ్డి, ఆర్ఏఎస్ శాస్త్రి, డాక్టర్ వివేకానంద్ రాయపెద్ది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాయచోటి సుబ్బయ్య మాట్లాడుతూ.. సంస్థ రాయచోటి ఆలోచనలతో ప్రారంభించబడి ప్రజలకు ఉచితంగా ఆధ్యాత్మిక జ్ఞానాన్ని, వివిధ కళలను నేర్పించడం జరుగుతుందన్నారు. పిల్లలకు, పెద్దలకు అందరికీ వివిధ రకాలైన ఆధ్యాత్మిక, విజ్ఞాన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. డాక్టర్ వివేకానంద్ రాయపెద్ది పాల్గొని మాట్లాడారు. స్కిల్స్ డెవలప్‌మెంట్ గురించి, మోటివేషన్ గురించి వివరించారు. బ్యాంకు ఖాతాదారులు, ఆదోని ప్రముఖులు, విద్యాసంస్థల అధినేతలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

హొళగుంద: మండలంలోని మార్లమడికి, హొళగుంద తదితర గ్రామాలకు చెందిన అనాథ వృద్ధులు, దివ్యాంగులకు మంగళవారం స్వచ్ఛంద సంస్థ సభ్యులు నిత్యావసర సరుకులకు పంపిణీ చేశారు. ఆదోని వివేకానంద సేవా సంస్థ అధ్యక్ష, ఉపాధ్యక్షులు మూర్తి, ప్రకాష్, భారత్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సిద్దార్థగౌడ్ ఆధ్వర్యంలో సంస్థ సభ్యులు రవికాంత్, శ్రీధర్‌శెట్టి తదితరులు బియ్యం, కందిబ్యాళ్లు, వంటనూనె, చక్కెర ఇతర నిత్యావసర సరుకుల కిట్లను అందజేశారు. సంస్థ ఆధ్వర్యంలో నిరాశ్రయులకు ప్రతి నెలా సరుకులను అందిస్తూ చేయూతనిస్తున్నారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఆర్ఐఓ గురువయ్యశెట్టి



సమావేశానికి హాజరైన సైన్సు అధ్యాపకులు

ఆదోని సెంట్రల్: త్వరలో ప్రారంభం కానున్న ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలపై సైన్సు అధ్యాపకులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం జరిగింది. గురువైయ్యశెట్టి, జిల్లా పరీక్షల కమిటీ సభ్యుడు ప్రభు మాట్లాడుతూ.. జిల్లాలో ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ప్రారంభమైనట్లు చెప్పారు. సైన్సు విద్యార్థులకు మాత్రం ఈ నెల 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. కొన్ని కళాశాలల్లో 11వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జరిగితే మరికొన్ని కళాశాలల్లో 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరుగుతాయని వెల్లడించారు. ప్రాక్టికల్స్ పరీక్షలు మాత్రం ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా జరుగుతాయన్నారు. ఎలా నిర్వహించాలి.. వచ్చిన మార్కులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఏ విధంగా ఎక్కించాలో వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మురళీమోహన్, ప్రకాష్‌రావు, ఆదోని డివిజన్ పరిధిలోని సైన్సు అధ్యాపకులు పాల్గొన్నారు.

తక్కువ బరువు పిల్లలపై ప్రత్యేక దృష్టి



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బాలవిద్యాధర్

ఆదోనిఅర్బన్: తక్కువ బరువుతో పుట్టిన పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డాక్టర్ బాల విద్యాధర్ అన్నారు. మంగళవారం ఆదోని ఏరియా ఆస్పత్రిలోని డీఈఐసీ సెంటర్‌లో ఆదోని డివిజన్‌లోని పీహెచ్‌సీ వైద్య సిబ్బందికి కడప పుష్పగిరి ఆస్పత్రి నుంచి వచ్చిన ట్రైనర్ బాలవిద్యాధర్‌తో శిక్షణ ఇప్పించారు. ఆర్‌ఓపీ ట్రైనింగ్‌లో భాగంగా తక్కువ బరువుతో పుట్టిన పిల్లలు (2 కేజీలు లేదా అంత కంటే తక్కువ), 9 నెలలు నిండకుండా ముందే పుట్టిన పిల్లలకు వచ్చే కంటి సమస్యలను ముందే ఎలా గుర్తించాలి, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై శిక్షణ, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్యనిపుణులు కె.నవీన్ కుమార్, విష్ణుప్రియ, వైద్య సిబ్బంది మోనికా, ప్రశాంతి, మారుతీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దస్తగిరి స్వామి ఉరుసు

నందవరం: మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో వెలసిన దస్తగిరి స్వామి ఉరుసు ఘనంగా జరిగింది. మంగళవారం దర్గాలో భక్తులు ప్రత్యేక ఫాతేహల్ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంత రెడ్డి, గ్రామ సర్పంచ్ మద్దీశ్వరి, వైస్ ఎంపీపీ నడిపి షేక్‌సాహెబ్, ఎంపీటీసీ సుశీలమ్మ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉరుసు సందర్భంగా దర్గాను విద్యుదీపాలతో విశేషంగా అలంకరించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గ్రామంలో కబడ్డీ పోటీలు నిర్వహించి గెలుపొందిన జట్లకు గ్రామ పెద్దలు బహుమతులు అందజేశారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరాముడు, ఈరన్న, డీల్లర్ యల్లప్ప గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న ఎంవీఐ శిశిర దీప్తి

ఎమ్మిగనూరుటౌన్: వాహన డ్రైవర్లు తగిన జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని ఆదోని ఎంవీఐ శిశిర దీప్తి పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక మినీ లారీ అసోసియేషన్ కార్యాలయంలో పలు వాహన డ్రైవర్లతో ప్రమాదాల నివారణపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ట్రాఫిక్ నియమాలు పాటించి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉందన్నారు. డ్రైవింగ్‌లో సెల్‌ఫోన్ ఉపయోగించకూడదని, మత్తు పదార్థాలు, మద్యం లాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ ఎస్‌ఐ రమేష్‌బాబు మాట్లాడగా కానిస్టేబుల్ నాగేశ్వరరావు, మినీ లారీ అసోసియేషన్ సంఘ నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

వైద్యురాలికి ఆత్మీయ వీడ్కోలు



డాక్టర్ శాంతిజ్యోతికి సన్మానిస్తున్న గ్రామ ప్రజలు

పెద్దకబూరు: పెద్దకడబూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్ ఎస్.శాంతిజ్యోతి ఉన్నత విద్య కోసం వెళుతున్నారు. మంగళవారం గ్రామ ప్రజలు, వైద్యులు ఆమెకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. పూలమాలలు వేసి సత్కరించారు. ఐదేళ్లలో ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఆమె ఉన్నత విద్య కోసం వెళ్లడంపై ఆనందం వ్యక్తం చేశారు. వైద్యులు తాహేర్, పీర్‌దాస్ బేగం, రవిచంద్ర కుమార్, సునీత, సీహెచ్‌ఓ కృష్ణ మోహన్, పీహెచ్ఎన్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

12న వృషభాల బండలాగుడు పోటీలు

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లె గ్రామంలో శ్రీ పామయ్య తాత తిరునాల సందర్భంగా ఈ నెల 12న రాష్ట్రస్థాయి సీనియర్ విభాగంలో వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, చక్రపాణిరెడ్డి, రంగయ్య, రామాంజనేయులు, జగదీశ్వరరెడ్డి తెలిపారు. వారు మంగళవారం పోటీల పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే వారు రూ.600 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా రూ.50 వేలు, 30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల నగదు బహుమతులు అందించనున్నట్లు ప్రకటించారు. వివరాలకు 98498 93101, 90005 08216 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

కోవర్టు అధికారి

- ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా టీడీపీ మద్దతు అధికారి చర్యలు
- స్వీపర్లు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, సెక్యూరిటీ జీతాలు ఆలస్యం చేస్తూ వేధింపులు
- ఐదు నెలల క్రితం హెచ్చరించిన ఎమ్మెల్యే
- లబోదిబోమంటున్న ఉద్యోగులు



ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డు కార్యాలయం

ఆదోనిఅర్బన్: గత టీడీపీ హయాంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు రావాలంటే దళారీ వ్యవస్థ ఉండేది. దీంతో ఎప్పుడు జీతాలు అందుతాయో తెలియని పరిస్థితి. జీతాలు సరిగా రాకపోవడంతో అప్పులు చేసి ఇబ్బందులకు గురయ్యేవారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట మేరకు దళారీ వ్యవస్థను రద్దు చేసి ఆప్కో సంస్థను ఏర్పాటు చేసి వారందరినీ కార్పొరేషన్‌లో చేర్పించారు. ప్రతినెలా ఆప్కో (ఆంధ్రప్రదేశ్ ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్) ద్వారా 1వ తేదీనే జీతాలు అందేలా చర్యలు చేపట్టారు. దీంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సీఎంకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ఇదిలాఉండగా ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో టీడీపీకి చెందిన ఓ అధికారి మాత్రం ఎన్నికల సమయంలో ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావాలని ఉద్దేశంతో పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి సక్రమంగా వేతనాలు అందించకపోవడం, చులకనగా చూస్తుండడంతో యార్డులోని సెక్యూరిటీలు, స్వీపర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతినెలా 1వ తేదీనే జీతాలు

2019 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రతినెలా 1వ తేదీనే వేతనాలు మంజూరు చేస్తోంది. అయితే కార్మికుల వేతన వ్యవహారాలు చూసే టీడీపీకి చెందిన ఉద్యోగి యార్డు సెక్రటరీకి దగ్గరగా ఉంటూ ఆయన పనులు చేస్తూ మెప్పు పొందారు. దీంతో ఆయన చేసినా నడుస్తోంది. ఉద్దేశపూర్వకంగా తమను చులకనగా చూడడం, నిర్లక్ష్యం చేయడం, వేధింపులకు గురిచేస్తున్నారని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు వాపోతున్నారు. ప్రతి నెలా 20వ తేదీ నాడే కార్మికుల వివరాలను వేతనాల కోసం ట్రెజరీలో సబ్మిట్ చేయాల్సి ఉండగా మూడు నెలల నుంచి నిర్లక్ష్యం చేస్తున్నారని వాపోతున్నారు. జీతాల గురించి ప్రశ్నిస్తే యార్డు సెక్రటరీకి చాడీలు చెప్పి తిట్టించడం, వేరే చోటికి మార్చడం, అటెండెన్స్ వేయకపోవడం లాంటి వేధింపులకు గురిచేస్తున్నాడని చెబుతున్నారు.

మూడు నెలల నుంచి పెనాల్టీ కడుతున్నాం

మూడు నెలల నుంచి సరైన సమయానికి జీతాలు రాకపోవడంతో రూ.600 పెనాల్టీ కడుతున్నామని కార్మికులు చెబుతున్నారు. ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో 100 మంది ఔట్‌సోర్సింగ్ పద్ధతిన సెక్యూరిటీలు, సిబ్బంది, కార్మికులు ఉన్నారు. దీంతో ఉద్యోగులు లోన్ తీసుకోవడంతో ప్రతినెలా బ్యాంకు ఖాతా నుంచి సొమ్ము కట్ అవుతుంది. అలాంటి వారికి వేతనాలు సకాలంలో పడకపోవడంతో ఖాతాలో డబ్బు లేక పెనాల్టీ పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత మూడు నెలలుగా ఇలా జరుగుతోంది, ప్రభుత్వం వేతనాలు ఇవ్వడం లేదన్న తప్పుడు ప్రచారం తెరలేపేందుకే సదరు అధికారి ఇలా చేస్తున్నాడని కార్మికులు చెబుతున్నారు. యార్డు సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి రెండు రోజులు స్థానిక కార్యాలయంలో ఉంటే, నాలుగు రోజులు కడపలో ఉంటున్నారని ఆరోపణలున్నాయి. దీంతో సదరు వ్యక్తి అనధికార సెక్రటరీగా చెలామణి అవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సదరు అధికారిపై చర్యలు తీసుకోవాలని ఔట్‌సోర్సింగ్ కార్మికులు కోరుతున్నారు.

కార్మికుల అటెండెన్స్ ఇవ్వలేదు



ఔట్ సోర్సింగ్ విభాగం హెడ్ ఇప్పటివరకు కార్మికుల అటెండెన్స్ వివరాలు ఇవ్వలేదు. అందుకే వేతనాల ప్రక్రియ ఆలస్యమైంది. ప్రతినెలా 25వ తేదీలోపు అటెండెన్స్ ఇవ్వాలి. టీడీపీ పార్టీకి చెందిన అధికారి ఎవరూ లేరు. డ్యూటీకి వచ్చిన వారు, రాని వారి వివరాలను మాకు తెలియజేయడం లేదు. మాకు తెలియజేస్తే అడ్జస్ట్‌మెంట్ చేసి సరి చేస్తాం.

– రామ్మోహన్ రెడ్డి, యార్డు సెక్రటరీ

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం



రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

ఆదోనిఅర్బన్: రహదారి భద్రతా మాసోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టీసీ ప్రాంగణంలో రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగులకు వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 120 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఐఎంఏ సభ్యులు, డాక్టర్లు గోపీనాథ్, కృష్ణమూర్తి, ఉషారావు పాల్గొని మాట్లాడారు. డ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు, నియమ, నిబంధనలు పాటించాలన్నారు. కంటిచూపును ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చాలని, అలాగే తమ కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకొని వాహనాలు నడపాలన్నారు. లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ ప్రసాదరావు, అధ్యక్షులు ధర్మారెడ్డి, వనపరాజు, మల్లికార్జునగౌడ్, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్‌రఫిక్, అసిస్టెంట్ ఇంజినీర్ వేణుగోపాల్, ఆర్టీసీ సూపరింటెండెంట్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.